కథ

రత్నాబాయి, సరోజినీ, మధూ, పిల్లలూ గేట్లో అడుగు పెడుతూనే జయలక్ష్మి పడుతూ, లేస్తూ ఎదురువచ్చింది.

"రండి, రండి ఈ ముహూర్తానికే సెకండ్ ఫ్లోర్‌లోనూ ఫోర్త్‌ఫ్లోర్‌లోనూ నాలుగు గృహ ప్రవేశాలున్నాయి. అందుకే ఇంత హడావుడి" అని ఒక నిమిషం ఆగి అలసట తీర్చుకుని, "మనది ఫస్ట్ ఫ్లోరేగా, మెట్లమీంచే వెళదాం. లిఫ్ట్ వద్దు. స్టైయిర్‌కేస్ చూసినట్లు వుంటుంది" అంది.

మెట్లు ఎక్కుతూ జయలక్ష్మి ఏదో చెప్పబోయేసరికి సరోజిని నెమ్మదిగా 'నువ్వు చెప్పేదంతా మా అత్తగారికి చెప్పు. ఆ ఐరన్‌లేడీ ఇంప్రెస్ అయ్యేలా' అంది. జయలక్ష్మి వెంటనే రెండు మెట్లు దిగి రత్నాబాయి పక్కకి వచ్చి 'మెట్లు చూశారా ఆంటీ, హార్ట్‌సర్జరీ చేయించుకున్న వాళ్ళు కూడా అవలీలగా ఎక్కేయొచ్చు" అంది. ఇంతలో ఇంకో బాచ్‌ని రిసీవ్ చేసుకుని తీసుకువస్తున్న జయలక్ష్మి భర్త 'షిఫ్టింగ్ కూడా చాలా ఈజీ, ఫ్రిజ్, బీరువా ఎంత హెవీలోడ్ అయినా సరే ఫ్రీగా తెచ్చేసుకోవచ్చు. ఐ మీన్ ఫ్రీ మూవ్‌మెంట్, నాట్ పేమెంట్స్ కదూ జయా! ఈ పాయింట్ కూడా నీ లిస్టులో చేర్చుకో' అన్నాడు. వీళ్ళు చివరిమెట్టుమీద వుండగానే లోపలి నుంచి జయలక్ష్మి అత్తగారి కంఠం ఖంగుమంటూ వినబడింది. 'మొదట నేను ససేమిరా, అన్నాను. కింద మనది కాదు, పైన మనది కాదు. ఎందుకొచ్చిన త్రిశంకుస్వర్గంరా బాబూ, వొద్దన్నాను. కానీ అన్నీ అంటిపుచ్చుకున్నట్లు ఈ సౌకర్యాలూ, అవీ చూశాక వదలబుద్ధి కాలేదు.." అంటూ.

సరోజిని ఎందుకైనా మంచిదని అత్తగారిని తీసుకు వెళ్ళి వక్తకు దగ్గరగా వున్న కుర్చీలో కూచోపెట్టి తనూ పక్కనే కూచుంది. జయలక్ష్మి అత్తగారు కుర్చీలో ముందుకు వంగి ఈ అత్తాకోడళ్ళని పలకరించి, కాసేపు వీళ్ళ వంక తిరిగి ఉపన్యాసం సాగించి వాళ్ళని కూడా తన శ్రోతలలో కలుపుకున్నట్టు తెలియజేసి ఇంక తన ధోరణిలో పడింది.

తరవాత ఇంకో అరగంటకి జయలక్ష్మి వచ్చి 'ఇల్లు చూద్దురుగాని' రండి అని తీసికెళ్ళేసరికి అక్కడున్న వాళ్ళందరికీ అసలు అపార్ట్‌మెంట్స్ అంటే ఏమిటో వాటి కథా కమామీషూ, ఈ అపార్ట్‌మెంట్స్ యొక్క పుట్టుపూర్వోత్తరాలూ, ఫిగర్స్ అండ్ ఫాక్ట్స్‌తో సహ కంఠతా వచ్చేశాయి. బిల్డర్స్ అడ్రస్, టెలిఫోన్ నంబర్లు సరేసరి. చెప్పనే అక్కర్లేదు. సరే, ఇంక జయలక్ష్మి ప్రతి గదిలోకీ తీసుకువెళ్ళి కొలతలలో మొదలుపెట్టి గుమ్మాలూ, తలుపులు, ఫ్లోరింగ్, కప్‌బోర్డులకి వాడిన మెటీరియల్, పెయింట్స్, కిటికీ మెష్‌డిజైన్, టాయ్‌లెట్స్ టైల్స్. వాష్‌బేసిన్స్, పవర్‌గేజర్, బాల్కనీలు, సిట్ అవుట్, వంటిల్లు, ఎగ్జాస్ట్ ఫ్యాన్స్, పూజగది, స్టోర్‌రూమ్, కుకింగ్ ప్లాట్‌ఫారమ్, వర్కింగ్ ప్లాట్‌ఫారమ్, సింక్, ఫ్రెష్‌వాటర్ టాప్, రన్నింగ్ వాటర్ టాంక్ వంటింటి వెనకాల సర్వీస్ ఏరియా, ఇంటిమొత్తం మీద ఎన్ని ప్లగ్ పాయింట్స్ వున్నదీ, ఒక్కటీ వదలకుండా ఓపిగ్గా చెప్పింది.

ప్రేక్షక శ్రోతలను ముగ్గురేసి చొప్పున విభజించి బెడ్‌రూమ్‌ల కిటికీల దగ్గరా, బాల్కనీలోనూ నిలబెట్టి గాలి వీచే వేగాన్నీ, దిశనీ, సమయాన్నీ ప్రత్యక్షంగా వర్ణించింది. తరవాత అందరినీ లిఫ్ట్‌లో టెర్రెస్ మీదకి తీసుకువచ్చింది. డిష్ యాంటెన్నా వైభవాన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించింది. ఓవర్‌హెడ్ ట్యాంకు పైపులైను చూపించింది.

దీపాలతో ధగద్ధగాయమానంగా వెలిగిపోతున్న నగర సౌందర్యాన్ని. కనుచూపు మేరలో ఉరకలు వేస్తున్న నదీమతల్లినీ చెయ్యి చాచి మాత్రం చూపించింది. పరవశంతో నోట మాట రాక, తన మౌనంతో అందరికీ ఆ రసానుభూతిని 'ఆవిష్కరింప' చేసుకునే అవకాశం ఇచ్చింది కూడా. ఓ మూడు నిమిషాలు తల తిప్పుతూ బడీ, గుడీ, కాలేజీ, బట్టలకొట్లు, సూపర్ మార్కెట్ అన్నింటి అడ్రస్సులూ ఒక్కబిగిన చెప్పేసింది. ఊపిరి పీల్చుకుందుకు ఒక్క క్షణం ఆగింది. 'ఇంతెందుకు.. మన ఊరు విష్ణుమూర్తి అయితే, ఈ అపార్ట్‌మెంట్ ఆయన హృదయపీఠం మీద నెలకొనిన లక్ష్మీదేవి అన్న మాట. సరిగ్గా అంతే.. విష్ణుమూర్తి శేషతల్పం మీద పడుకుంటే పాదాలు ఒత్తుతూ కూచునే లక్ష్మీదేవి మాత్రం కాదు.'

ఓ పావుగంట నించీ జయలక్ష్మి చెప్తున్నంత సేపూ

# పరుగు

- అనూరాధ

రిస్ట్ వాచ్ చూసుకుంటూ రెస్ట్‌లెస్ మూవ్‌మెంట్స్ ఇస్తోంది జయలక్ష్మి అత్తగారు.

'అంతా నువ్వే చెప్పెయ్యాలా, ఆవిడకి కూడా కొంచెం ఛాన్సు ఇయ్యి పాపం..' అంది సరోజిని. ఇంతలో కరెంట్ పోయింది.

కిటికీ చీకటిని చీల్చుకుని కాగడాలా గప్పుమంది జయలక్ష్మి అత్తగారి కంఠం 'ఏం కంగారుపడకండి. జనరేటర్ ఉంది. ఇందాక చూశారుగా రూమ్. అది జనరేటర్‌దే. పవర్‌కట్ సిటీకే గానీ మన అపార్ట్‌మెంట్స్‌కి కాదు.." అంటుండగానే దీపాలు వెలిగాయి.

* * *

పిల్లల్నిస్కూలు బస్ ఎక్కించి సరోజిని తిరిగి వచ్చేసరికి మధు వరండాలో కూచుని షేవ్ చేసుకుంటూ ట్రాన్సిస్టర్‌లో ఇంగ్లీషు వార్తలు వింటున్నాడు. లోపల్నుంచి టి.వి. వినబడుతోంది. 'ఓహో.. ఈవిడ అక్కడుందన్న మాట' అనుకుని మధు దగ్గరికి వెళ్ళి నెమ్మదిగా 'అడిగారా...?' అంది.

'ఉహుఁ..'

'ఏం?'

'అడగక్కర్లేదు..'

'అంటే..? అడక్కుండానే ఇస్తారా? అడిగినా ఇవ్వరా.

'మొదటిది నీకు.. రెండోది నాకు..'

ఈ జవాబుతో సరోజిని నీరసపడిపోయింది. 'అయితే ఇంకెందుకూ అడగడం..' అంటూ అతని పక్కన చతికిలబడింది.

'యాభయ్యోసారి అడుగుతున్నాను మిమ్మల్ని. మీకు ఇష్టమా కాదా అది చెప్పండి ముందు' అంటూ నిలదీసింది.

'అమ్మని అడుగుతావుగా అప్పుడు తెలుస్తుందిలే.."

సరోజిని ఒక్కసారి లేచి నిలబడి కళ్ళు పెద్దవి చేసి ఆర్తంగా అతని భుజాలు పట్టుకుని 'చెప్పారా.. నిజంగా.. ఏమని?' అంది.

'చెప్పక్కర్లేదు. తెలుస్తుంది. మా అమ్మ కదా.. ' అన్నాడు తాపీగా.

'నేనే అడుగుతాను. నాకేం భయమా. నా ఒక్కదానికోసమేనా' అంటూ విసురుగా నడిచింది. హాల్లోకి వచ్చేసరికి అడుగులు నిదానంగా పడ్డాయి.

ముఖం ప్రసన్నంగా మారింది.

అత్తగారి వంక చూసి, 'ఉండండి అత్తయ్యా, కాఫీ తెస్తాను.' వంటింట్లోకి వెళ్ళి ఫ్లాస్కూ, రెండు గ్లాసులూ తెచ్చి వాటిల్లో కాఫీ పోసి ఒకటి ఆవిడకి ఇచ్చి రెండవది తను తీసుకుని పక్కనే సోఫాలో కూచుంది. ఎలా మొదలుపెడితే బావుంటుంది అని ఆలోచిస్తూంటే 'నేను నర్సరీకి వెడుతున్నాను. మధు ఆఫీసుకు వెళుతున్నప్పుడు స్కూటర్ మీద దిగబెట్టమంటాను. నీకేమైనా కావాలా గుర్తుచేసుకో.. ' అంటూ పేపరు తీసుకుని రత్నాబాయి లేచింది. ఆలోచన తెగక సరోజిని అలాగే కూచుంది. మధు బెడ్‌రూంలోంచి వచ్చి నాలుగు పుస్తకాలు సరోజిని ముందు పడేసి 'ఇందులో తండ్రిని పొలం అమ్మవద్దన్న కొడుకు కథ, ఇందులో అత్తగారిని ఇల్లు అమ్మమన్న కోడలి కథ, ఇందులో తల్లిని నగల కోసం వేధించిన కూతురి కథ.. ఎట్సెట్రా .. ఎట్సెట్రా.. నీకు కావలసినంత వెరైటీ మెటీరియల్.. ప్రొసీడ్..' అంటూ ఎదురుగా కూచున్నాడు. 'అమ్మడాలే కాదు.. కొనడాలూ ఉంటాయి.. సరిగ్గా చూడండి. లేవండి. టైమైంది. దోవలో నర్సరీగూడా వెళ్లాలా' అంది సరోజిని భారమంతా 'నర్సరీ' మీద వదిలేస్తూ.

రత్నాబాయి నర్సరీకి వెళ్ళి మొక్కలు తీసుకు వచ్చేసరికి కొబ్బరికాయలు తీసే మనిషి వచ్చాడు. 'వీడెవడూ, యమభటుల్నా..' అని విసుక్కుని 'మళ్ళీరా.. అత్తయ్యగారు ఇప్పుడే వచ్చారు ఎండలో పడి.' అని సరోజిని చెపుతుంటే- 'ఫర్వాలేదులే.. ' అని వాడిని ఆగమని ఆదరా బాదరా భోజనం చేసి కాయలు దింపించడం మొదలుపెట్టింది రత్నాబాయి. నాలుగు నెలలకోసారి రత్నాబాయి అత్యుత్సాహంగా నిర్వహించే ఆ మహత్తర కార్యక్రమం అంటే మహా చిరాకు సరోజినికి. ధమా ధమా చప్పుడు. నెత్తిమీద పడుతున్నట్లే ఉంటాయి ఆ దిక్కుమాలిన కాయలు పిడుగుల్లా. వీటికి సాయం ఆ మట్టలూ, గులకలూ, చెత్త చెత్త.. ఒకటీ రెండూ కాదు పదహారు చెట్లు ఇంక ఆ కాయల బేరసారాలు ఒక పట్టాన తెగవు. మళ్ళీ కాయలు తీయించేవరకూ సాగుతూనే వుంటాయి. 'ఎంత ఓపికో మహాతల్లికి' అని లోపల్లోపలే తిట్టుకుంటూ కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకీ,

దొడ్లోకి తిరుగుతూ మధ్యాహ్నం అంతా గడిపేసింది సరోజిని.

నాలుయేసరికి వీధి చివర స్కూలు బస్ ఆగేచోటికి వెళ్ళి పిల్లల్ని తీసుకువచ్చింది. అక్కణ్ణించే పని.

రాత్రి భోజనాలు చేస్తుంటే.. 'నిన్న రాత్రి గృహప్రవేశానికి వెళ్ళిరావడం. ఇవాళంతా కొబ్బరికాయల పనితో అలసిపోయినట్లున్నారు,' అంది అత్తగారితో ఏమంటుందోనని.

'లేదు, లేదు. పొద్దుట్నించీ తోటలోనే ఉన్నాను. నాకు బావుంది. ప్లెజెంట్‌గా వుంది. ఇవాళ ఎండకూడా ఎక్కువగా లేదు..' అని 'వెన్నెల బావుంది. వాకింగ్‌కి వెళ్దాం వస్తారా.. టి.వి చూస్తారా..' అని అడిగింది.

సరోజిని చప్పున 'అలాగే.. టి.విలో చూసే ప్రోగ్రామ్స్ ఏం లేవు. పిల్లలు పడుకుంటారు. తాళం వేసుకు వెళ్దాం..' అని పావుగంటలో పని తెముల్చుకుని వచ్చేసింది.

ముగ్గురూ కొంతదూరం నడిచాక సరోజిని స్వగతంలా 'ఈ వీధి ఎంత మారిపోయిందో పోష్ లొకాలిటీలా అయిపోయింది. ప్రతి ఇంటి ముందూ కారే. అందరివీ ఏ.సీ బెడ్‌రూమ్‌లే. ఇదివరకిలా ఉండేది కాదు'

రత్నాబాయి ఒప్పుకుంటున్నట్లు తల ఊపింది.

దాంతో సరోజినికి కాస్త ధైర్యం వచ్చింది.

'మిడిల్ క్లాస్‌లో కూడా కమర్షియల్ అవుట్‌లుక్ బాగా పెరిగిపోయింది. ఎక్కడా ఇంటి ముందూ వెనుకా కాస్త స్థలం కూడా వదలడం లేదు. వుంటే పావురాయి గూళ్ళలా కట్టి అద్దెలకిచ్చే మేడలు. లేకపోతే అపార్ట్‌మెంట్స్. గదులూ, మనుషులూ తప్ప దొడ్డీ మొక్కలూ ఎక్కడా కనపడటం లేదు. ఇంటి ముందు కాస్త స్థలం వుంటే చాలు రెండు గదులు వేసి షాపులకిచ్చేస్తున్నారు..' అని ఒక నిమిషం ప్రయత్నంతో కంఠంలోని మెచ్చుకోలు తెచ్చుకుని 'అంత సెంటర్లో వుండి కూడా మన ఇల్లే విశాలంగా, చల్లగా హాయిగా, ప్రశాంతంగా, ఫార్మ్‌హౌస్‌లా వుంటుంది' అంది.

'కానీ ఈ మధ్య మన రోడ్‌కి ట్రాఫిక్ ఎక్కువైపోయింది. కారు హారన్లు అవీ చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉంటోంది' అని రత్నాబాయి అంటుండగానే ఆవిడ సౌండ్ పొల్యూషన్, చెట్లూ, మొక్కలూ అంటూ ఆ ధోరణిలోకి ఎక్కడ పోతుందోనని సరోజిని వెంటనే కంఠంలో కుతూహలం, భక్తిశ్రద్ధలూ తొణకిసలాడుతుండగా 'అత్తయ్యా, మనిల్లు కట్టి ఎన్నేళ్ళవుతోంది? మీర్కు ఎరుగుదురా కట్టడం..' అని అడిగింది.



సరోజిని అలా అడుగుతుండగానే కారు ఒకటి నెమ్మదిగా వాళ్ళ పక్కనించి వెళ్ళింది.

మధు 'అమ్మా కారులో ఉన్నది ఎవరో చూశావా.. శేషూ. అతని భార్యాను. ఆవిడకి డ్రైవింగ్ నేర్పుతున్నాడు అన్నాడు.

సరోజినికి వీరావేశం వొచ్చేసింది.

ఏడాది క్రితం వరకూ డొక్కు మోపెడ్ వేసుకుని డబ, డబ లాడుతూ తిరిగేవారూ. ఇప్పుడు కారు లేందే కదలడం లేదు. పిల్లల స్కూలుకీ, కూరలకీ, చీరలకీ అన్నింటికీ కారే. మన వీధి చివర ఉండే ఇల్లు బిల్డర్స్‌కి అమ్మేశాట్ట. స్థలం చాలా ఎక్కువ కదా బాగా డబ్బు వచ్చిందట. ఇతను పాత ఇళ్ళు అమ్ముతుంటే, వాళ్ళ అన్నయ్య పొలాలు ఇళ్ళ ప్లాట్లు చేసి అమ్ముతున్నాట్ట! వాళ్లేమిటి? ఆస్తులున్నవాళ్లందరికీ ఇదే పని. ఇరవైయేళ్ళు చదువుకుని అరవై యేళ్ళొచ్చే వరకూ ఉద్యోగం చేసినా చాలీ చాలని సంపాదనేగా అని సర్దుకుని 'జయలక్ష్మి ఫ్లాట్ కొనడం కాదు. మాకందరికీ అదే ధ్యాస అయిపోయింది' అంది. రత్నాబాయి నవ్వి 'మనచుట్టూ ఏం జరుగుతున్నదో తెలుసుకోవాలిగా!' అని 'ఈ ఫ్లాట్సూ యిళ్లూ కొనడం, అమ్మడం బిల్డర్స్ చెప్తున్నంత తేలిక కాదు. వాళ్ళు చెప్పిన టైమ్‌కి ఫ్లాట్ ఇవ్వరు. మధ్యలో ఎన్నో కాంప్లికేషన్స్. ఎస్టిమేషన్ దాటి మన బడ్జెట్ తలకిందులైపోతుంది. రిస్క్ తీసుకునే ధైర్యం వుండాలి' అంది

మధు టైమ్ చూసుకుని 'అమ్మా ఇంక ఇంటికి వెళదాం' అన్నాడు.

సరోజిని వదలకుండా 'చెప్పండత్తయ్యా ఎన్నేళ్ళవుతుంది. మన ఇల్లు కట్టి' అని గుర్తు చేసింది.

'అరవైయేళ్ళవుతుందేమో. కట్టడం నాకు తెలీదు కానీ మా అత్తగారు చెప్తుండేవారు. ఆవిడకి ఈ ఇల్లంటే చాలా ఇష్టం. స్థలం ఎలా కొన్నారో ముందర అయిదు వందల గజాలు కొన్నాక ఇంకో ఆరువందల గజాలు ఎలా కలిసివచ్చిందో అది కూడా కొనడానికి ఎన్ని తిప్పలుపడ్డారో ఆవిడ అస్తమానూ గుర్తు చేసుకునేవారు.

"పునాదులు ఎంత లోతు తీశారో, ఎన్ని ఆవల ఇటుక, ఎన్ని పడవల ఇసిక. ఎన్ని బస్తాల సిమ్మెంటు పట్టిందో, కలప ఎక్కణ్ణించి తెప్పించారో అడిగినవాళ్ళకీ, అడగని వాళ్ళకీ అందరికీ చెపుతుండేవారు. ఇల్లు కట్టిన మేస్త్రీలు, కూలీలు అందరి పేర్లూ ఆవిడకి గుర్తే. పొలం అమ్మేసి కడదాం అని మా మావగారు అంటే ఆవిడ ఒప్పుకోలేదుట. 'రెండుపంటల పొలం అమ్ముకోవడం ఏమిటి? కాస్త కాస్త అప్పు తీర్చగలం కానీ సెంటు సెంటు భూమి కొనగలవా, పిల్లలు ఎదిగే లోపు అప్పు తీర్చేయొచ్చు' అని పంటతో అప్పు తీర్చారుట. అప్పుడు ఇళ్ళు కట్టుకుందుకు ఇన్ని రకాల అప్పులూ సౌకర్యాలూ లేవు కదా.

'అఫ్‌కోర్స్ నా సెంటిమెంట్ అనుకో.. మా అత్తగారి మనవలూ, నా మనవలూ ఈ యింట్లోనే పుట్టి పెరుగుతున్నారని తలుచుకుంటే నాకెంతో సంతోషంగా, సంతృప్తిగా, గర్వంగా అనిపిస్తుంది.

"మనం టి.వి., డైనింగ్ టేబుల్, ఫ్రిజ్ లాంటివి తెచ్చి ఇంట్లో సర్దుతుంటే చిన్నపిల్లలకి కొత్త ఫ్యాషన్ బట్టలు వేస్తున్నట్లు మురిపెంగా వుంటుంది నాకు.."

ఆ పాటికి ముగ్గురూ ఇంటిదగ్గరకి వచ్చారు. ఇంటి ముందు నిలబడి యిల్లంతా ఒక్కసారి కలియజూసింది రత్నాబాయి. నిశ్శబ్దంగా వుంది. మేడమీద ఒక్క లైటు వెలుగుతోంది. టి.వి. నెమ్మదిగా వినబడుతోంది.

తల్లీ, కొడుకూ వరండాలో ఉన్న పేము కుర్చీల్లో కూచున్నారు. సరోజిని తాళం తీసుకుని లోపలికి వెళ్ళి పిల్లలు సరిగ్గా పడుకున్నారో లేదో చూసి, హార్లిక్స్ కలుపుకుని వచ్చి వాళ్లిద్దరికీ చెరో కప్పూ ఇచ్చి తనో కప్పు తీసుకుని నిశ్శబ్దంగా కూచుంది. అత్తగారు చెప్పిన చరిత్రని ఆకళింపు చేసుకుంటున్నట్లు.

మధు అన్నాడు, 'ఈ యింటికి అప్‌స్టెయర్

వెయ్యడం నాకు తెలుసు. మాఅమ్మ డాబా మీద పడక్కుర్చీలో పడుకుని నన్ను ఒళ్ళో కూచోపెట్టుకుని పనివాళ్ళు పనిచేస్తుంటే చూస్తుండేది'.

రత్నాబాయి మధు వంక చూసి నవ్వింది.

"మేడ వెయ్యాలనీ, మేడ మీద కాపురం చెయ్యాలనీ మా అత్తగారిని మహా కోరికగా ఉండేది. కానీ ఇల్లు కట్టి అప్పు తీర్చే సరికి పిల్లలు పెద్దవాళ్లయ్యారు. చదువులూ, పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ, వైద్యాలూ, ఒక్కసారిగా వచ్చిపడ్డ ఖర్చులకి పొలం ఎలాగూ అమ్మేశాం. ఇల్లు ఇంకో అంతస్తు వేస్తే ధైర్యంగా వుంటుంది. అమ్మ మనసూ తీరుతుంది అని హౌసింగ్ లోను తీసుకుని అప్‌స్టెయిర్ వేశారు. మీ మావగారు. మేడవేశాక ఏడెనిమిదేళ్ళు కిందా పైనా వాడుకున్నాం. తరవాత పైన అద్దెకిచ్చేసి కింద వుండడం అలవాటయింది. మొదట్లో వంద రూపాయల అద్దె వస్తుంటే గొప్పగా వుండేది. ఇప్పుడు పదిహేను వందలూ వస్తున్నా చవగ్గా ఇచ్చాం అనిపిస్తోంది." మధు ఆవలిస్తూ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. రత్నాబాయి 'అయిదు నిమిషాలు కూర్చో. పడుకుందుగానిలే అని కుర్చీ కొంచెం అతని వేపు జరుపుకుని 'మన ఇల్లు బిల్డర్స్ నలుగురైదుగురు అడుగుతున్నారు. మనకి నచ్చిన ప్లాన్‌లో ఫ్లాట్స్ కట్టిస్తారట కన్‌సెషన్‌కి. వాళ్ళు మిగిలినవి అమ్ముకుంటారు" అంది. మధు సరోజిని వంక చూశాడు. 'మిగిలిన డబ్బుతో మనం కారు, ఏసీ, వొస్తే ఇంకో ఫ్లాటూ, ఏర్పాటు చేసుకోవచ్చు. ఇల్లు పీకి పందిరేసు కున్నట్లు- ' అంటూ. సరోజినికి ఏమనాలో తెలీక బితుకు బితుకుమంటూ చూసింది.

మధు లోపలికి వెళ్లిపోయాడు. సరోజినీ వెనకాలే వెళ్లింది.

కుర్చీ ముందుకు జరుపుకుని కాళ్లు స్తంభానికి ఆనించి తల వెనక్కి వాల్చి, కళ్లు మూసుకుని ఆలోచనలో పడింది రత్నాబాయి.

ఇల్లూ, తోటా ప్రశాంతంగా నిద్రపోతున్నాయి. అన్నిరకాల పువ్వులూ, మామిడిచిగుళ్లూ, వేపపూలూ కలగలిపిన వింత సువాసనలు విరజిమ్ముతూ గాలి వుండుండి వీస్తోంది. మధ్య మధ్య సన్నగా వినిపించీ వినిపించనట్టు పిట్టలు కూస్తున్నాయి.


నగరం మాత్రం నిద్రపోలేదనడానికి గుర్తుగా బస్సులు, లారీలు వెడుతున్న చప్పుడు అప్పుడప్పుడూ వినబడుతోంది.

మూడేళ్ల మధు ఓ చేత్తో గేటు పట్టుకుని నోట్లో వేలేసుకుని వీధిలో వెళ్లే వాహనాల వంక చిత్రంగా చూస్తూ నించున్న దృశ్యం రత్నాబాయి కళ్లముందు కదిలింది. ఆరాటపడిపోతున్న సరోజిని మొహం గుర్తు వచ్చింది.

కళ్లు తెరిచేసరికి పొద్దున్న నర్సరీ నించి తెచ్చిన మొక్కలు ఎదురుగా కనబడ్డాయి. వాటి దగ్గరకు వెళ్లి రెండు చేతులతో వాటిని నిమిరింది. తల వంచి వాటి ఆకులు చెంపల కానించుకుంది. ఆకుల్నీ, పువ్వుల్నీ గాఢంగా ఆఘ్రాణించింది.

ఆకు రాలుస్తూ, చిగురుతొడుగుతూ మొగ్గ వేస్తూ ప్రకృతికి ప్రతిస్పందిస్తూ, కొమ్మలూ, రెమ్మలూ, చిలవలు పలవలుగా సహజంగా ఎదిగే ఈ మొక్కల్లాగే ఎదిగితే బావుణ్ణు ఈ పిల్లలు.. అనుకుంది మనవల్ని తలుచుకుంటూ.

# విశాఖపట్నంలో వింత వినాయకుడు



విశాఖ లలితానగర్‌లో ఈ వినాయక దేవాలయం నిర్మాణం జరిగి మూడు దశాబ్దాలు అయింది. విశాఖ నగరం నేటి పారిశ్రామిక రూపాన్ని సంతరించుకోని ఆ రోజుల్లో ఈ దేవాలయం నిర్మాణమే ఒక గొప్ప కార్యంగా చెప్పుకునేవారు. అయినప్పటికీ అనాటి దేవాలయం ఈనాటికీ అంతగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. నగరానికి ఓ మూలగా రద్దీ లేని ప్రాంతంలో వుండడమే అందుకు ముఖ్యకారణం కావచ్చు.

దేవాలయ ప్రాంగణంలో అందరినీ ఆకర్షించేది వినాయకుడి ముఖద్వార రూపమే...! ఎదురొచ్చిన వాళ్ళను అమాంతం మింగవచ్చినట్లు కనబడే ఆ రూపం ప్రశస్తమైన హస్తకళా నైపుణ్యంతో మలచబడి ఒకింత భీతావహంగా తనదైన ఒక ప్రత్యేకతను కలిగివుంటుంది. ఆలయ ముఖద్వారం అల్లంత దూరాన కనబడుతూ వుండగానే దైవ దర్శనం జరిగి, ద్వార ప్రవేశం చేస్తూ సాక్షాత్తూ ఆ ప్రథమదేవుని శరీరంతో



ఐక్యమవుతున్న అనుభూతితో పులకరించి పోతారు భక్తులు.

ప్రతి దినమూ ప్రత్యేకించి సాయంత్రం వేళలో ఆలయ ప్రాంగణం రద్దీగా వుంటుంది. ఆలయ ముఖ ప్రవేశం చేసిన భక్తులు దేవాలయంలో విఘ్నేశ్వరుడి పూర్తి రూపాన్ని దర్శించగలరు. హిందువుల పండుగలలో అతి ప్రాచీనమైనది 'వినాయక చవితి' హిందూ దేవతా మూర్తులలో అత్యంత చతురుడు, రాజకీయ దురంధురుడు అయిన శ్రీకృష్ణ భగవానుడు సయితం వినాయకుణ్ణి పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి..

వినాయక చవితినాడు ఈదేవాలయంలో జరిగే నవరాత్రి పండుగ చూడవలసినదే గాని చెప్పనలవికాదు. రంగురంగుల విద్యుద్దీపాల కాంతితో నవరత్నాలు పోసిన వెండి కొండలా, వచ్చేపోయే జనంతో మానవ మహా సముద్రంలా వెలిగిపోతూ ఉంటుంది.

నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి దినమూ సుగంధ ద్రవ్యాలతో కలిసిన నీటితో, క్షీరంతోనూ స్వామి విగ్రహాన్ని అభిషేకించి విగ్రహమంతా వెండితొడుగుతో రకరకాల ఆభరణాలతో పట్టు వస్త్రాలతో సువాసన వెదజల్లే అపూర్వ పుష్పాలతో అలంకరించి వేదపఠనంగావిస్తూ పూజ చేస్తారు.

వ్యాసం - ఫోటోలు :
పి. ఎ. ప్రభాకర్ దత్తు